తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## వైభవంగా రథోత్సవం

పుత్తూరురూరల్, మే 28 ప్రభాతవార్త:
పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి శ్రీ సదాశివేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవ సందర్భంగా స్వామివారు, అమ్మవారులు రథంపై ఊరేగించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే రాత్రి విద్యుత్ దీపాలతో ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు. ఉభయ దాతగా పుత్తూరు బలిజ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఆలయ చైర్మన్ కొడగంటి రమేష్‌బాబు, ధర్మకర్తల మండల సభ్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బదిలీలకు పైరవీలు

కోట, మే 28 ప్రభాతవార్త
జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రారంభం కావడంతో కొందరు పైరవీలు సాగిస్తున్నారు. తమకు అనుకూలమైన చోటకు బదిలీ చేయించుకునేందుకు ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలతో ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఇటు జిల్లా కలెక్టరేట్‌కు, అటు ఉన్నతాధికారుల క్యాంప్ కార్యాలయాలకు క్యూకడుతున్నారు. అవసరమైతే ఎంతైనా ముడుపులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ నెల 17న ప్రభుత్వ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నెల 30 వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించింది. వచ్చే నెల 1 నుంచి కొత్త పోస్టింగ్‌లో చేరాల్సి ఉంటుంది. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారికి సాధారణ బదిలీ జరుగుతుంది. రెండేళ్ల పూర్తయిన వారి అభ్యర్థనలు పరిగణనలోకి తీసుకొని మార్గదర్శకాలకు అనుగుణంగా బదిలీలకు అవకాశం కల్పించాల్సి ఉంటుంది. అంగవైకల్యం, కుటుంబ సభ్యుల ఆరోగ్యపరమైన ఇబ్బందులు, దీర్ఘకాలిక వ్యాధులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో మార్గదర్శకాల ఉల్లంఘన జరిగితే తీవ్రంగా పరిగణిస్తామని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అధికారులు మాత్రం ఎటువంటి సిఫార్సులకు, పైరవీలకు అవకాశం ఉండదని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వంలో విలీనమైన ఆర్టీసీలోనూ ఉద్యోగుల బదిలీకి ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో ఆయా డిపోల నుంచి పెద్దసంఖ్యలో రిక్వెస్టులు పెడుతున్నట్లు సమాచారం.

# ఈ ఏడాది షార్‌లో మరో విచిత్రం

### నాలుగు నెలల్లో నాలుగు తరహా రాకెట్ల ప్రయోగాలు
### నేటి ఉదయం 10.42 గంటలకు జిఎస్ఎల్‌వి ఎఫ్12 నింగికి
### శ్రీహరికోటలో పటిష్టమైన బందోబస్తు - పరిసరాలు అప్రమత్తం







శ్రీహరికోటలోని రెండవ ప్రయోగ వేదిక, సెకండ్ లాంచ్‌ప్యాడ్‌పై నింగికి గురిపెట్టిన జిఎస్ఎల్‌వి ఎఫ్12 రాకెట్, జిఎస్ఎల్‌వి రాకెట్ నిర్మాణంలో తలమునకలైన శాస్త్రవేత్తలు

శ్రీహరికోట (తడ), మే 28 ప్రభాతవార్త
శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం ఎప్పటికప్పుడు సరికొత్తగా రాకెట్ల ప్రయోగాలు చేపడుతోంది. సోమవారం ఉదయం 10.42 గంటలకు ఇక్కడి సెకండ్ లాంచ్ ప్యాడ్ నుంచి శాస్త్రవేత్తలు జిఎస్ఎల్‌వి ఎఫ్12 రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. ఈ రాకెట్ ద్వారా మన నావిగేషన్ ఉపగ్రహం ఎన్‌విఎస్ 01 ఒక్క దానినే అంతరిక్షంలోకి చేర్చనున్నారు. సాధారణంగా నావిగేషన్ ఉపగ్రహాలతో పాటు ఇతర ఉపగ్రహాలు ప్రయోగించే అవకాశం లేదు. ఇటీవల ఇక్కడ నుంచి వివిధ రకాల రాకెట్లతో స్వదేశీ ఉపగ్రహాల కన్నా విదేశీ ఉపగ్రహాలనే ఎక్కువగా ప్రయోగిస్తూ ఇస్రో వాణిజ్య లాభాలను ఆర్జిస్తోంది. అయితే అప్పుడప్పుడు కమర్షియల్‌గా కాకుండా దేశ ప్రయోజనాల కోసం మాత్రమే తయారు చేసిన ఉపగ్రహాలను మన రాకెట్ కేంద్రం నుంచి అంతరిక్షంలోకి తేలికగా పంపుతున్నారు. ఇదిలావుంటే సోమవారం జిఎస్ఎల్‌వి ఎఫ్12 రాకెట్‌ను ప్రయోగిస్తుండగా, ఈ ఏడాది ఇప్పటికి మూడు రాకెట్లను మన షార్ నుంచి విజయవంతంగా ప్రయోగించి ఉన్నారు. నెలకో రాకెట్ చొప్పున ఫిబ్రవరి నుంచి ఇప్పటిదాకా నాలుగు రాకెట్లు ప్రయోగించగా, అవన్నీ విభిన్న తరహా రాకెట్లు కావడం విశేషం. ఫిబ్రవరి 10న ఎస్ఎస్ఎల్‌వి డి2 రాకెట్‌ను సక్సెస్‌ఫుల్‌గా లాంచ్ చేశారు. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో ఇది రెండవది కాగా, మొదటి వైఫల్యం తర్వాత రెండోసారి విజయాన్ని అందుకున్నారు. మూడు ఉపగ్రహాలను ఈ ఛోటా భాయ్ అంతరిక్షంలోకి చేర్చింది. మార్చి 26న ఎల్‌విఎం 3 బాహుబలి రాకెట్ ద్వారా యూకెకి చెందిన 36 వన్‌వెబ్ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి అలవోకగా ప్రవేశపెట్టారు. ఇటువంటి రాకెట్ ద్వారానే అంతకుముందు కూడా 36 ఉపగ్రహాలనే విజయవంతంగా కక్ష్యకు చేర్చి ఇస్రో ప్రపంచ వాణిజ్య రంగంలో కాలుమోపింది. ఏప్రిల్ 22న పిఎస్ఎల్‌వి సి55 రాకెట్ ద్వారా సింగపూర్‌కి చెందిన రెండు ఉపగ్రహాలను ప్రయోగించి మరోసారి కమర్షియల్ లాభాలు ఆర్జించారు. అప్పటికి వరుసగా మూడు విభిన్న తరహా రాకెట్ల ద్వారా ఏకంగా 41 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి చేర్చడం వల్ల షార్‌కు హ్యాట్రిక్ లభించింది. తాజాగా సోమవారం ఈ మూడు ప్రయోగాల కన్నా భిన్నంగా జియో సింక్రనస్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో జిఎస్ఎల్‌వి ఎఫ్12ను ప్రయోగిస్తున్నారు. దీనిద్వారా మన నావిగేషన్ ఉపగ్రహం ఎన్‌విఎస్-01 కక్ష్యలో చేరితే నాలుగు నెలల్లో నాలుగు తరహా రాకెట్లను శ్రీహరికోట నుంచి విజయవంతంగా ప్రయోగించి శాస్త్రవేత్తలు శభాష్ అనిపించుకోవడం ఖాయం.

**షార్ చుట్టూ పటిష్ట బందోబస్తు**

జిఎస్ఎల్‌వి ఎఫ్12 రాకెట్ ప్రయోగం సందర్భంగా శ్రీహరికోటతో పాటు పరిసర ప్రాంతాల్లోనూ పటిష్టమైన బందోబస్తు, తనిఖీలు నిర్వహించారు. సిఐఎస్ఎఫ్ దళాలతో పాటు తిరుపతి జిల్లా పోలీసు యంత్రాంగం కూడా అప్రమత్తమై నిఘా పెంచింది. షార్ అడవుల్లో కూంబింగ్ నిర్వహించారు. ఇటు పులికాట్ తీరంలోనూ, వేనాడు, పేర్నాడు దీవుల్లో అపరిచిత వ్యక్తుల సంచారం గురించి ఆరా తీశారు. ఈ ప్రయోగ వీక్షణకు విజిటర్స్ గ్యాలరీకి వచ్చే వారికి సౌకర్యాలు కల్పిస్తున్నారు. జిఎస్ఎల్‌వి రాకెట్లలో క్రయో ఇంధనం వాడుతున్న కారణంగా ఎప్పటికప్పుడు అత్యంత జాగ్రత్తలు తీసుకోవడం అవసరం కావడంతో ఇస్రో వర్గాలు, షార్ అధికారులు ముందుగానే అప్రమత్తమయ్యారు.

## పలకరించిన ఈశాన్యం

### తిరుపతిలో ఉరుములు,గాలులతో భారీ వర్షం





తిరుపతి, మే 28ప్రభాతవార్త :
ఈశాన్యరుతుపవనాలు రెండురోజులు ముందుగానే రాయలసీమ జిల్లాలను తాకాయి. ఆది వారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లనిగాలులు వీయడం, మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మార్పుచెంది ఉరుములు,గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం 3గంటల నుంచి తిరుపతి నగరం పరిసరాల్లో వడగళ్ళవాన కురిసింది. ఈ వానకు గాలి కూడా రావడంతో రేణిగుంటరోడ్డు, ఆటోనగర్, మంగళం, రెండు మద్దిమానులు ప్రాంతం, ఎబి భర్ధన్‌కాలనీ, మార్క్స్ నగర్, ఒటేరు, కొరమేనుగుంట, తిరుపతి రూరల్ ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్‌స్తంభాలు పడిపోయాయి. దీంతో దాదాపు మూడుగంటలపాటు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. తిరుపతి నగరంతోబాటు పరిసరాలు అంధకారంలో అలముకున్నాయి. భారీ వర్షం ఆగిన తరువాత యుద్ధప్రాతిపదికన నగరపాలకసంస్థ అధికారులు, సిబ్బంది, విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది అన్ని ప్రాంతాలకు చేరుకుని పనులు చేపట్టారు. రాత్రి 8గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఇంకా వర్షానికి దెబ్బతిన్న ఇల్లు ,ప్రజలు నిరాశ్రయులయ్యారు. అసలే రోహిణి కార్తెతో ,వేసవిఉష్ణోగ్రతలతో ఏడుకొండలపై అల్లాడిపోతున్న తిరుపతి వాసులకు భారీ వాన కురవడం ఉపశమనం కలిగించింది. ఒక్కసారిగా కురిసిన వర్షానికి నగరవాసులు ఆనందంవ్యక్తం చేశారు. ఇల్లుకోల్పోయిన వారికి అన్ని విధాలా ఆదుకోవాలని, ప్రభుత్వం సహాయసహకారాలు అందించాలని సిపిఐ నేత మురళి కోరారు.

### ప్రశాంత వాతావరణంలో
## సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు

### ఉదయం 53.02 శాతం, మధ్యాహ్నం 52.57శాతం హాజరు -కలెక్టర్



తిరుపతిరూరల్, మే28 ప్రభాతవార్త:
యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్స్ ప్రిలిమినరీ-2023 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు కలెక్టర్ వెంకట రమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 9:30 గంట నుండి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుండి 4:30 గంటల వరకు రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. తిరుపతిలో నిర్వహించిన 13 పరీక్షా కేంద్రాలలో సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షలకు 6333మంది 53.02 శాతం, మధ్యాహ్నం 3329 మంది 52.57శాతం హాజరైనట్లు తెలిపారు. పరీక్షా పత్రాలను స్ట్రాంగ్‌రూమ్ నుండి బందోబస్త్ నడుమ పరీక్షా కేంద్రాలకు తరలించడం జరిగిందని, తిరుపతి ఆర్డీఓ కనకనరసారెడ్డి పరీక్షా పత్రాల కస్టోడియన్ వ్యవహరించారని,రెండు సెషన్లలో అన్ని పరీక్షా కేంద్రాలను సందర్శించడం జరిగిందన్నారు. అభ్యర్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించామని, పరీక్షలు వ్రాయటానికి బెంచ్‌లు, త్రాగునీరు, మెడికల్ క్యాంపులు, రవాణా సౌకర్యం వంటివి ఏర్పాటు చేసామని తెలిపారు. కేంద్ర యుపిఎస్‌సి నిబంధనల మేరకు అన్ని విధాల పకడ్బందీగా చర్యలు చేపట్టి, పరీక్షలు నిర్వహించామని, అన్ని శాఖల సమన్వయంతో పరీక్షల నిర్వాహణ విజయవంతమైందని తెలిపారు.

## యుపిఎస్‌సి సివిల్ ప్రిలిమ్స్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాం

– రాష్ట్ర అబ్జర్వర్ ప్రద్యుమ్న

తిరుపతి కేంద్రంగా నిర్వహించిన యుపిఎస్‌సి ప్రిలిమ్స్-2023 పరీక్షలను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పకడ్బందీగా నిర్వహించి, విజయవంతంగా పూర్తి చేసామని రాష్ట్ర అబ్జర్వర్, సెక్రటరీ అర్ అండ్ బి శాఖ ప్రధాన కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న తెలిపారు. ఆదివారం ఉదయం 9:30 గంట నుండి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుండి 4:30 గంటల వరకు రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించిన పరీక్షా కేంద్రాలను ప్రద్యుమ్న పర్యవేక్షించారు. సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షల నిర్వాహణపై గత శుక్రారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, ఒక పద్ధతి ప్రకారం ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేసి, పకడ్బందీగా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. యుపిఎస్‌సి పరీక్షల నిర్వాహణలో డిల్లీ నుండి ఇద్దరు అధికారులు ఇక్కడ చేపట్టిన ఏర్పాట్లను, పరీక్ష నిర్వాహణను పరిశీలించడం జరిగిందన్నారు. యుపిఎస్‌సి నిర్వహిస్తున్న సివిల్స్ ప్రిలిమనరీ పరీక్షలు వ్రాయటానికి అనేక ప్రాంతాల నుండి, చుట్టు పక్కల జిల్లాల నుండి అభ్యర్థులు వచ్చినట్లు తెలిపారు. పోలీసు, ఆర్టీసి, వివిధ శాఖలతో పాటు జిల్లా అధికారుల సమన్వయంతో ఏర్పాట్లను సజావుగా చేసినట్లు తెలిపారు. పరీక్షల సమయం ముగిసిన వెంటనే ఓఎంఆర్ షీట్లను బందోబస్త్ నడుమ పోస్ట్ ఆఫీసుకు పంపినట్లు తెలిపారు.

### ఉభయదేవేరులతో
## ముత్యాలపందిరిపై గోవిందుడు







తిరుపతి,మే 28 ప్రభాతవార్త:
తిరుపతినగరంలోని గోవిందరాజస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి ముత్యపుపందిరివాహనం అధిరోహించి భక్తులను కటాక్షించాడు. ముత్యాలు తెల్లనివి..చల్లనివి. సాయంసంధ్యవేళ చిరుజల్లులు కురుస్తుండగా వరుణదేవుడు పలకరించే సమయంలో శ్రీదేవిభూదేవి సమేతుడై గోవిందరాజస్వామి ఎంతో ముగ్ధ మనోహరంగా ముత్యాలపందిరిపై ఊరేగారు. స్వామివారి వాహనసేవ ఆలయ మాఢవీధుల్లో ఊరేగగా భక్తుల గోవిందనామస్మరణలతో కర్పూర నీరాజనం పట్టారు. ఉదయం ఆలయంలోపల శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజస్వామివారి ఉత్సవర్లకు ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, కంకణభట్టార్ ఏపి శ్రీనివాస దీక్షితులు,ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ రవికుమార్, సూపరింటెండెంట్ నారాయణ, ఆలయ ఇన్స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

### అడవిలో పురుడు పోసిన
## కుయ్...కుయ్...బృందం

### -తల్లీబిడ్డ క్షేమం



అడవిలో పురుడుపోసిన గణేష్ ఇన్‌సెట్‌లో తరలిస్తున్న దృశ్యం

చౌడేపల్లి, మే 28 ప్రభాతవార్త
పురిటినొప్పులు తట్టుకోలేక మహిళ అరుపులు... కళ్ళఎదుటే భార్య పడుతున్న బాధ చూడలేని భర్త... గుర్తించిన చుట్టుపక్కల వారు కుయ్...కుయ్...కి సమాచార మందించారు...విషయం తెలుసుకొన్న 108సిబ్బంది పరుగుల తీసి అక్కడే పురుడు పోసి తల్లీబిడ్డలను రక్షించారు...మండలంలోని శెట్టిపేట పంచాయతీ ముదిరెడ్డిపల్లికి సమీపంలోని మరుదుమలై అటవిలో ఓ మామిడి తోటకు గర్భంతోవున్న వసంత, రాజశేఖర్ దంపతులిద్దరూ కాపలా వున్నారు. ఈక్రమంలో ఆదివారం మధ్యాహ్నం వసంతకు పురుటి నొప్పులు మొదలయ్యాయి. అడవిలో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో రాజశేఖర్ వుండగా గుర్తించిన చుట్టుపక్కలవారు 108కు ఫోన్ చేసారు. విషయం తెలుసుకొన్న వెంటనే ఇఎంటి గిరింద్రప్పగారి గణేష్, పైలెట్ ప్రసాద్‌లు ముదిరెడ్డిపల్లికి చేరుకొన్నారు. అయితే గర్భవతి అడవిలో వుందన్న సమాచారంతో సిబ్బంది 2కిలోమీటర్లు మేర అడవిలో నడుచుకొంటూ వెళ్ళారు. అక్కడ పురిటిబాధ పడుతున్న ఎస్టీ మహిళకు అక్కడే పురుడుపోసి పండంటి మగబిడ్డను ప్రపంచానికి పరిచయం చేసారు. అంతే కాకుండా తల్లీబిడ్డలను అడవిలోంచి తీసుకొచ్చి స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. దారిలేకపోయినా నడుచుకొంటూ వెళ్ళి పురుడు పోయడంతోపాటు వారిద్దరినీ క్షేమంగా ఆసుపత్రి చేర్చిన గణేష్, ప్రసాద్‌లను పలువురు అభినందించారు.

## ఢిల్లీని వణికించిన తెలుగుపురుషుడు ఎన్టీఆర్

### -కొద్దినెలల్లోనే తెలుగువారి ఖ్యాతి ప్రపంచానికి చాటాడు



తిరుపతి,మే 28 ప్రభాతవార్త :
తెలుగువారి పౌరుషం ఢిల్లీనేతలకు తెలిసేలా తెలుగుదేశం పార్టీని స్థాపించి, అతి తక్కువ రోజుల్లోనే ఢిల్లీని వణికించేలా చేసిన మహా పురుషుడు స్వర్గీయ ఎన్టీరామారావు అని తెలుగు దేశం పార్టీ శ్రేణులు కొనియాడారు. తెలుగు దేశంపార్టీ వ్యవస్థాపకుడు, విశ్వవిఖ్యాత సినీ నటుడు స్వర్గీయ ఎన్టీరామారావు శతజయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం తిరుపతిలో ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి ప్రత్యేక పూజలతో, పూలమాలలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఇక్కడ కేక్‌ను కట్‌చేసి కార్యకర్తలు సంబ రాలు జరుపుకున్నారు. శతజయంతి ఉత్సవాల్లో మహానాడులో భాగంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించుకోవడం సంతోషకరమని టిడిపి రాయలసీమ మీడియా కోఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మ తెలిపారు.

స్వర్ణముఖి డ్యాం ఆధునీకరణకు
రూ.53కోట్లతో టెండర్లు
4లో

## పోటెత్తిన భక్త జనం

### సామాన్య భక్తులకు తిప్పలు
### రికార్డు స్థాయిలో రాహుకేతుదోష పూజలు



శ్రీకాళహస్తి,మే 28 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు కడలి తరంగాల్లా కదలి వచ్చారు. ఎండలు దడపుట్టిస్తున్నాయి. అయితే భక్తులు మాత్రం కడలి తరంగాల్లా కదలి వస్తున్నారు. అయితే దర్శనాలకు వచ్చిన సామాన్య జనం తిప్పలు వర్ణనాతీతంగా మారింది. శనివారం రాత్రి నుంచి వరదలా జనం తరలి వచ్చారు. పట్టణంలోని నాలుగుమాడావీధుల్లోని అతిధి గృహాలు నిండాయి. బస అవకాశం లేక ఇబ్బందులు పడ్డారు.దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాజగోపురం పక్కన మాస్టర్‌ప్లాన్ అమలుకు ఖాళీ చేసిన స్థలంలో పడకేసారు.చల్లటి గాలిలో ఎంతో ఆహ్లాదంగా కునుకు తీసారు. ఆలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకొని బాధల నుంచి విముక్తి పొందటానికి ప్రయత్నిస్తున్నారు. ఆదివారం ఈ పూజలు జరిపించుకున్న భక్తులు దర్శనాలకు తిప్పలు పడ్డారు.

**రోజుకో విధానం . . .**

ఆలయంలో అధికారులు రోజు కోక విధానం అమలు చేస్తున్నారు. దాంతో ఎవరు ఎటు వెళ్ళాలో దర్శనాలకు అవకాశం మెంతో తెలియని స్థితి చోటు చేసుకుంది.ఇక ఆలయంలోపలకు వెళ్ళటానికి ఏర్పాటు చేసిన గేట్లునుంచి ఎవరు ఎటు వెళుతున్నారు.అంతుచిక్కని ప్రశ్న. ఎవరు విఐపిలో ఎవరు సామాన్య భక్తులో తెలియలేదు. దాంతో దళారుల దందా విచ్చల విడిగా సాగింది. గేట్ల నుంచి దళారులు తాము ఒప్పందం చేసుకున్న వారిని తీసుకెళుతుంటే సామాన్య భక్తులు పెదవి విరిచారు. ఇదే అదునుగా క్యూలైన్లలో సామాన్యభక్తుల రాకను ఆపి విఐపిలంటూ తీసుకెళ్ళటం ఆశ్చర్యపరచింది, ఈ దుస్థితితో నిత్యం భక్తుల్లో అసహనం పెరిగి క్యూలైన్లను పర్యవేక్షిస్తున్న సిబ్బందిపై తిరగబడుతున్నారు. 'దేవుని దర్శనాలకు సిఫార్సులా?' అంటూ నిలదీస్తున్నారు. అయితే విఐపిల ముసుగులో తమ దందాను సాగించుకుంటున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంస్కరణలు ప్రవేశ పెడుతున్నారు. కానీ పర్యవేక్షించే దిక్కు కరువయ్యారు. దాంతో సంస్కరణలు కేవలం ఫైళ్లకే పరిమితమౌతున్నాయి.ఇక్కడ ప్రోటోకాల్ దర్శనాల పేరిట సాగుతున్న దర్శనాలపై తీవ్ర విమర్శలు వ్యక్తమౌతున్నాయి.

**30వేల మంది దర్శనం**

శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి సుమారు 30వేల మందిభక్తులు దర్శించుకున్నట్లు సాయంత్రం విడుదల చేసిన సమాచారంలో ఆలయాధికారులు పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలఉుర 4820 మంది పూజలు జరిపించుకున్నట్లు ప్రకటించారు.ఉదయం నుంచి 30వేల మంది దర్శించుకున్నట్లు ప్రకటించారు.

## ఉచితకంటి ఆపరేషన్లకు 32మంది ఎంపిక

కుప్పంరూరల్, మే 28 ప్రభాతవార్త



సాయిమాతా సేవా ట్రస్ట్, బెంగళూరు శారద కంటి ఆస్పత్రి అధ్వర్యంలో ఆదివారం కుప్పం బాలుర హైస్కూల్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. సుమారు 190మందికి కంటి పరీక్షలు జరిపి వారిలో 32మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్ బాబు,వైద్య బృందం బాబు, మహదేవ పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు

పెద్దపంజాణి, మే 28 ప్రభతావార్త



స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో దివంగత ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూజలు చేసి ఆయన చేసిన సేవలను కినియాడారు. కార్యక్రమంలో నేతలు కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, ధనుంజయ, దిలీప్, సనావుల్లా, గణేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

రొంపిచెర్ల,మే28ప్రబాతవార్త



మండల పరిదిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు గాయాలపాలైన సంఘటన ఆదివారం జరిగింది. బొమ్మయ్యగారిపల్లెకు చెందిన జావిద్(21) స్నేహితులు సల్మాన్, గణేష్‌లతో కలిపి ద్విచక్ర వాహనంపై ఆదివారం తెల్లవారు జామున పీలేరుకు బయలుదేరారు. మార్గమద్యంలో వాహనం అదపుతప్పడంతో జావిద్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికి తీవ్రగాయాలు కాగా వారిని పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## అగ్ని ప్రమాద బాధితులకు సాయం

యర్రావారిపాలెం,మే28ప్రబాతవార్త



మండల పరిదిలోని చింతగుంటగ్రామం చిన్నపేల పచ్చార్లపల్లె, సంక్రాంతిగుట్టపై ఉన్న గిరిజన యానాది కాలనీలోఇటీవల పూరి గుడిసెలు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈసందర్భంగా వారిని ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం నాయకులు ఆదుకున్నారు. నిత్యవరసరుకులు, బట్టలు, వంటపాత్రలు,నగదుకొంతమేర ఇచ్చి ఆదుకున్నారు. కార్యక్రమంలో ఆసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాసులు, గడ్డం శ్రీనివాసులు,సీనియర్ న్యాయవాది రాయల సుధాకరరాయల్,టేకుమంద రెడ్డెప్పలు పాల్గొన్నారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలుపూర్తయినా గిరిజనులు పక్కా ఇండ్లకు నోచుకోకపోవడం దురదృష్టమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన గిరిజన యానాదులకు పక్కా ఇండ్లు నిర్మించి అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్‌చేశారు. ఈకార్యక్రమంలో గిరిజన యానాది నాయకులు పులిపాపయ్య, కంబాల ఈశ్వరయ్య, నారాయణమ్మ, జానం సుజాత, వెలుగోటి రేవతి, నిమ్మనపల్లె రెడ్డెప్ప, గానుగపెంట సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

## మరణమే లేని మహనీయుడు ఎన్టీఆర్

చౌడేపల్లి, మే 28 ప్రభాతవార్త

మరణమే లేని మహనీయుడు ఎన్టీఆర్ అని పలువురు కొనియాడారు. ఆదివారం దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన వీరాభిమాని పార్థసారధి వందపైగా పురష్కారాలందించి వారిని ఎన్టీఆర్ చిత్రపటంతో కూడిన మెమొంటోలతో సత్కరించారు. తేదేపా నాయకులు శ్రీధర్‌రాజు, గడ్డంవారిపల్లి వెంకట్రమణ, మునివెంకటప్ప, చెంగల్‌రాయుడు, కాటిపేరి సుబ్బారెడ్డి తదితరులచే బస్టాండు నందు ఎన్టీఆర్ చిత్ర పటానికి పూల మాలలేసి ఘనంగా నివాళులర్పించారు. పంజానిపల్లి బాబు, కృష్ణమూర్తి, కళ్యాణ్‌లు పాల్గొన్నారు.

సిడిపిఎల్ 2 : ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు అభిమానులు

## నేడు మున్సిపల్ స్పందన

చిత్తూరు, మే 28 ప్రభాతవార్త:

చిత్తూరు నగర ప్రజల సమస్యలను పరిష్కరించడానికి చిత్తూరు మున్సిపల్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఉదయం 10.30 గంటల నుండి స్పందన కార్యక్రమం జరుగుతుందని కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటారన్నారు. అలాగే ప్రతి డివిజన్ పరిధిలోని వార్డు సచివాలయాల్లో ప్రతి రోజు సాయంత్రం 3 గంటల నుండి 5 గంటల వరకు సచివాలయ సిబ్బంది స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని, ఈ కార్యక్రమానికి స్థానికులు హాజరై వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించుకోవచ్చునని ఆమె తెలిపారు.

## తెలుగుజాతి మరువలేని మహనీయుడు ఎన్టీఆర్

– చంద్రబాబు కార్యదర్శి మనోహర్

కుప్పం, మే 28 ప్రభాతవార్త



తెలుగుజాతి మరువలేని మహనీయుడు దివంగత ఎన్టీఆర్ అని చంద్రబాబు కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహంకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మగౌరవం కాపాడేందుకు నడుంబిగించిన మహానేత దివంగత ఎన్టీఆర్ అన్నారు. ఆయన తెచ్చిన సంక్షేమ పథకాలు పేదల అభివృద్ధికి దోహదపడ్డాయన్నారు. నాటి ఎన్టీ ఆర్ అడుగుజాడల్లో తెదేపా అధినేత చంద్రబాబునాయుడు నడుస్తూ పేదరికం లేని సమాజం కోసం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు మంజునాథ్, డికెపల్లిమణి, మురుగేష్, శివకుమార్, రాజగోపాల్, అమర్, ముజీబ్, మతీన్, ఉమ్మర్, రవి, వేణుగోపాల్, మంజు, బగ్గిడి వెంకటేష్, ప్రకాష్, వెంకటేష్, ఎల్ఎల్ ఉదయ్‌కుమార్, తిరుమగళ్ పాల్గొన్నారు.

**శాంతిపురం :** తెదేపా వ్యవస్థాపకులు దివంగత ఎన్టీఆర్ శతజయంతిని శాంతిపురంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహంకు పూజలు చేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కేదార్‌నాథ్, రాజు, మురుగేష్, ఈడికి చరణ్, శివ పాల్గొన్నారు.

## అన్నక్యాంటీన్‌లో ఎన్టీఆర్‌జయంతి సందర్భంగా అన్నదానం

కుప్పం, మే 28 ప్రభాతవార్త



దివంగత ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా స్థానిక మొబైల్ అన్న క్యాంటీన్ ద్వారా కువైట్‌కు చెందిన ఎన్ఆర్ ఐ సందీప్‌కుమార్ పసుపులేటి అధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసిన అనంతరం సుమారు ఐదువందల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో తెదేపా నేతలు డికెపల్లి మణి, పిఎస్ సతీష్‌కుమార్, వేణుగోపాల్, యశ్వంత్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిచే ఉచిత మెగా వైద్య శిబిరం

కుప్పంరూరల్, మే 28 ప్రభాతవార్త



మండలంలోని నూలుకుంటలో ఆదివారం కుప్పం బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత డా॥ బిఆర్ సురేష్‌బాబు అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 150మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. బిపి, చక్కెరవ్యాధి, ఇసిజి వంటి పరీక్షలు జరిపిన అనంతరం ఉచితంగా మందులు, మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలోడా॥ హరిత, డా॥ యువరాజ్, ఆస్పత్రి సిబ్బంది, సర్పంచ్ కృష్ణన్, స్థానికులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

శాంతిపురం, మే 28 ప్రభాతవార్త



ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో జరుగుతున్న 42వ సీనియర్ నేషనల్ షూటింగ్ బాల్ చాంఫియన్‌షిప్ పోటీల్లో మండలంలోని శెట్టేపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని అపూర్వ ఎంపికై పోటీల్లో పాల్గొంటోంది. ఈసందర్భంగా అపూర్వను హెచ్ఎం తీగలవెంకట్, పిడి మురళీధర్, జిల్లా షూటింగ్‌బాల్ కార్యదర్శి నరేష్‌బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నేరుగా పథకాల డబ్బులు ప్రజలకు అందిస్తోంది జగనన్నే

– ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి, మే 28 ప్రభాతవార్త



నవరత్నాలు పథకాల ద్వారా లబ్దిదారులకు నేరుగా డబ్బులు అందిస్తున్న ఘనత సిఎం జగనన్నకే దక్కుతుందని ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. ఆదివారం నాగిరెడ్డిపల్లి పంచాయతీ రాగిమాకులపల్లి, కడపల్లి ఎస్టీ కాలనీ, గౌడమాకులపల్లి, చల్లావారిపల్లి, తిరుమల కొండయ్యపల్లి, బొంతలవారిపల్లి గ్రామాల్లో గడపగడపకు కార్యక్రమంలో భాగంగా ఆయన 385 గృహాలను సందర్శించి ప్రజలతో మాట్లాడారు. నాలుగేళ్ల పాలనలో బిసి,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు 2.10లక్షల కోట్లు నేరుగా లబ్దిదారులకే చెల్లించామన్నారు. దేశం పాలనలో నాయీబ్రాహ్మణులు, నేతకార్మికులు, మత్స్యకారులు విస్మరించబడ్డారన్నారు. నేడు మత్స్యకార భరోసా, నేతన్న నేస్తం, వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాలతో ఆయా వర్గాలను ఆదుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు మరోమారు వైకాపాను ఆదరించాలని కోరారు. సమావేశంలో ఎంపిపి రెడ్డెప్ప, కన్వీనర్ బాగారెడ్డి, వైస్‌ఎంపిపి బాబు, నేతలు శంకరప్ప, రాజారెడ్డి, సర్పంచ్ కుమారమ్మ, సునంద శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి

బంగారుపాళ్యం, మే 28 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శతజయంతిని ఆదివారం బంగారుపాళ్యం మండల తెలుగుదేశం నాయకులు ఘనంగా నిర్వహించారు. శేషాపురం గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ జయచంద్ర ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బంగారుపాళ్యం చిన్నయ్యనాయుడు కాంప్లెక్స్ ఆవరణలో పార్టీ జెండాను ఎగురవేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జయచంద్రనాయుడు, జిల్లా పార్టీ కార్యదర్శి కోకా ప్రకాష్, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ సి.ధరణి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు లోకనాధనాయుడు, నాయకులు కమలనాధరెడ్డి, రఘ తదితరులు పాల్గొన్నారు.

## నేడు చిత్తూరుకు జాతీయ సఫాయి కర్మచారి కమీషనర్

చిత్తూరు, మే 28 ప్రభాతవార్త:

జాతీయ సఫాయి కర్మచారి కమీషనర్ ఎం.వెంకటేషన్ సోమవారం చిత్తూరు నగరంలో పర్యటించనున్నారు. జాతీయ సఫాయి కర్మచారి కమీషనర్ ఎం.వెంకటేషన్ సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు చిత్తూరు నగరంలోని సఫాయి కర్మచారి కాలనీని పరిశీలించి సాయంత్రం 3 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్ కమీషనర్లు, వివిధ శాఖల అధికారులు, డివిఎంసి కమిటీ సభ్యులతో జరిగే సమావేశంలో పాల్గొంటారని జిల్లా సాంఘీక సంక్షేమశాఖ డిడి రాజ్యలక్ష్మి తెలిపారు. అనతరం సాయంత్రం 5 గంటలకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఛీఫ్ టర్మినల్ మేనేజర్, యూనియన్ నాయకులు, అసోసియేషన్ సభ్యులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, సఫాయి కర్మచారి కాంట్రాక్టర్లలను కలుసుకొంటారని ఆమె తెలిపారు. అనంతరం ఆయన సాంయత్రం 6 గంటలకు తమిళనాడు రాష్టంకు బయలుదేరి వెళ్తారని ఆమె పేర్కొన్నారు.

## గాయపడ్డ కార్మికులకు సిఎంసి ఆసుపత్రిలో వైద్యం

చిత్తూరు, మే 28 ప్రభాతవార్త:

చిత్తూరు నగర పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులుగా విధులు నిర్వర్తించుకొని శనివారం రాత్రి ఇళ్ళకు తిరిగి వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఇద్దరు పారిశుధ్య కార్మికులను తమిళనాడు వేలూరు సిఎంసి ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు మున్సిపాల్టీలో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్న ప్రవీణ్‌కుమార్(41), ఆదిలక్ష్మి(32)లు శనివారం విధులు ముగించుకొని ద్విచక్రవాహనంలో వరిగిపల్లికి సమీపంలో వెళ్తుండగా బెంగళూరు నుండి వస్తున్న వాహనం ఢీకొనడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. ప్రవీణ్‌కుమార్‌కు కుడికాలు ఫ్రాక్చర్ కావడం, ఆదిలక్ష్మికి కుడిప్రక్క తలకు బలమైన గాయం తగిలిందన్నారు. కలెక్టర్ సలిగి షన్మోహన్ ఆదేశాల మేరకు గాయపడిన ఇద్దరికి వేలూరు సిఎంసి ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నామన్నారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణ వీరి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకొంటున్నారని ఆయన పేర్కొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## సినీ, రాజకీయాలకు వన్నె తెచ్చిన ఎన్‌టిఆర్

–మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బీరం రాజేశ్వరరావు

వెంకటగిరి, మే 28 ప్రభాతవార్త



సినీ రాజకీయ రంగాలకు దివంగత ఎన్‌టి రామరావు వన్నె తెచ్చారని మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బీరం రాజేశ్వరరావు తెలిపారు.ఆదివారం ఎన్‌టిఆర్ శత జయంతి సందర్భగ ఎన్‌టిఆర్ కాలనీలో ఉన్న రామరావు విగ్రహనికి పూలమాలు వేసి,కేక్‌కట్ చేసి టడిపి నేతలు నివాళ ర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌టిఆర్ సినిరంగంలో రారాజుగ ఒక వెలుగు వెలిగారని తెలిపారు. ఈ కార్యక్రమంలొ మాజి పట్టణ అద్యక్షులు మంకు ఆనంద్, జి శ్రీనివాసులు, బాలకృష్ణ, మదునాయుడు,సుబ్బుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది

–రైతుకూలి సంఘం జిల్లా కార్యదర్శి జి సునీత

వెంకటగిరి, మే 28 ప్రభాతవార్త

వ్యవసాయ రంగం సంక్షోభంలొ కొట్టుమిట్టాడుతొందని రైతుకూలి సంఘం జిల్లా కార్యదర్శి జి సునీత తెలిపారు.ఆదివారం ఆర్‌విఎం ఉన్నత పాఠశాలలో రైతుకూలి సంఘం వార్షిక సంచికను ఆవిష్కరించారు.ఈ సందర్బగ ఆమెమాట్లాడుతూ కేంద్ర,రాష్ట్రప్రభుత్వాల వ్యతిరేక విదానల వల్ల వ్యవసాయ రంగం కుదేలు అయిందన్నారు.ఎరువులు,విత్తనాల దరలను కూడ ప్రభుత్వం పెంచినట్లు తెలిపారు.రైతులకు పెట్టుబడులు పెరుగుతన్నందువల్ల రైతులకు గిట్టుబాటు దరలు లబించడంలేదన్నారు. కేంద్రప్రభుత్వం మరోవైపు ఆహర ఉత్పత్తులపై ఐదు శాతం జిఎస్‌టి విదించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతుకూలి సంఘం జిల్లా సహయక కార ్యదర్శి వివి రమణయ్య,విశ్రాంత ప్రిన్స్‌పాల్ బికె ప్రసాద్,ఎఐఎప్‌టియు జిల్లా అద్యక్షులు లక్ష్మీరెడ్డి,ఆర్‌సుబ్బరాయులు తదితరులు పాల్గోన్నారు.

## విఆర్‌ఓ లాడ్జిలో మృతి

కోట, మార్చి ప్రభాతవార్త

కోట క్రాస్ రోడ్డులోని ఓ లాడ్జిలో చిట్టమూరు మండలం యాకసిరి విఆర్‌ఓ రమేష్‌నాయుడు (49)మృతి చెందాడు. ఆదివారం ఆమేరకు లాడ్జి నిర్వాహకులు పిర్యాదు చేశారు. వాకాడు మండలం కోండాపురంకు చెందిన రమేష్ నాయుడు గతంలో కోట మండలం నెల్లూరు పల్లి విఆర్‌ఓ గా పని చేశారు. ప్రస్తుతం యాకసిరి విఆర్‌ఓగా పనిచేస్తున్నారని స్దానికులు తెలిపారు. రెండు నెలలగా ఆయన డ్యూటికి హాజరుకావడం లేదని సమాచారం. ఆరోగ్య సమస్యలతో బాదపడుతున్నారని పోలీసులు తెలిపారు. అంతే కాకుండా ఇంట్లో కుటుంభ సమస్యలు కూడా ఉన్నాయని పోలీసులు పేర్కొన్నారు. ఆమేరకు మృత దేహన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

## మామిడి రైతులకు గాలుల దెబ్బ

కోట, మే 28 ప్రభాతవార్త



ఈదురు గాలులతో మామిడి రైతులు మళ్లీ నష్టపోయారు. ఇప్పటికే పలుమార్లు వీచిన గాలితో కాపు దెబ్బతిన్నది. శనివారం రాత్రి ఉన్నట్టుండి హోరు గాలులు వీచాయి. ఆ వెంటనే వర్షం కురవడంతో భారీగా నష్టం జరిగింది. పలుచోట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. కోట మండలంలో వజ్జావారిపాలెం, ఊనుగుంటపాలెం, గూడలి గ్రామాల్లో రైతులుభారీగానష్టపోయారు.దీంతోనేలరాలినకాయలను కేజి పది రూపాయలు లెక్కన అమ్ముకుంటున్నట్లు తెలిపారు.

## లయన్స్ క్లబ్‌చే ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

సూళ్లూరుపేట, మే 28 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలో నూతనంగా స్థాపించిన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీతులసీ ఆయుర్వేదిక్ ఆసుపత్రి వారి సహకారంతో ఆదివారం స్థానిక బాలికల జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని లయన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి ప్రారంభించారు. డాక్టర్ శివప్రసాద్, సాయిప్రియ ఈ శిబిరంలో రోగులను పరీక్షించి ఉచిత వైద్యంతో పాటు మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ ఛైర్మన్ సుదర్శనరావు, అధ్యక్షులు కామిరెడ్డి ఆదిశేషారెడ్డి, కార్యదర్శి దువ్వూరు సుబ్రహ్మణ్యంరెడ్డితో పాటు శ్రీహరికోట, సూళ్లూరుపేటకు చెందిన లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## పుదూరులో ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలు

నాయుడుపేట, మే 28 ప్రభాతవార్త



నాయుడుపేట మండలంలోని పుదూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా నాయుడుపేట మాజీ ఎఎంసి ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు కామిరెడ్డి అశోక్‌కుమార్‌రెడ్డిలు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి పార్టీ కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధిస్తుందని, పేదలకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మాజీ ఉపసర్పంచ్ షేక్ కరిముల్లా, విన్నమాల మధురెడ్డి, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి

సూళ్లూరుపేట, మే 28 ప్రభాతవార్త



దివంగత నేత ఎన్‌టి రామారావు శత జయంతి సంబరాల్లో భాగంగా సూళ్లూరుపేట తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆదివారం ఘనంగా నివాళి అర్పించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సినీరంగంలో మకుటంలేని మహారాజుగా వెలుగొంది, రాజకీయ రంగంలో ప్రజలకు సంక్షేమ పాలన రుచి చూపించిన సంక్షేమ పథకాల ప్రదాత ఎన్‌టిఆర్ అని ఆయన కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో ఎన్‌టిఆర్ స్ఫూర్తితో పనిచేసి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కార్యకర్తలు అందరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా సీనియర్ తెలుగుదేశం కార్యకర్తలు పృధ్వీరాజా, బందారు ఆంజనేయులును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్ మునిరాజా, గండవరం రమేష్‌రెడ్డి, మహీధర్, మునుస్వామి, పిఆర్ రమేష్‌లాల్, పిఎ వెంకటేశ్వర్లు, ప్రతాప్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో ప్రపంచ రుతుశ్రవ దినోత్సవం

సూళ్లూరుపేట, మే 28 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలో మెప్మా ఆధ్వర్యంలో ప్రపంచ రుతుశ్రవ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి రుతుస్రావంపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మహిళలు రుతుస్రావం పట్ల ఏ విధంగా వ్యవహరించాలన్న అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఇఓ నారాయణమ్మ, హనుమాయి, సమాఖ్య పట్టణ అధ్యక్షుడు స్వప్న, ఆర్‌పిలు డాక్టర్ ఉత్పల, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

## బిజేపి నిరంకుశ పాలనకు నిదర్శనం

సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జీ. శశికుమార్

గూడూరు, మే 28, ప్రభాతవార్త

బిజేపి నిరంకుశ పాలనకు నిదర్శనం పార్లమెంటు భవన ప్రారంభోత్సవమని సిపిఐ గూడూరు నియోజకవర్గ కార్యదర్శి జి. శశికుమార్ అన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన పార్లమెంటు భవనం అవసరం లేకున్నప్పటికి వందల కోట్ల రూపాయిలు వెచ్చించి నిర్మించిన భవనాన్ని రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభించాల్లో ఉండగా ఆ భవనాన్ని ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభించడం మోదీ దేశంలోని ఆడపడుచులను కించపరిచే విధంగా ఉందన్నారు. ఎస్టీ మహిళ కావడంతో ప్రధాని మొండిగా ప్రోటోకాల్ పాటించకపోవడం దారుణమన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి షేక్ కాలేషా మాట్లాడుతూ దేశంలోని 21 జాతీయ పార్టీలు మోదీ పార్లమెంటు భవన ప్రారంభోత్సవాన్ని బహిష్కరించినా పట్టించుకోకపోవడం బీజేపి నిరంకుశ వైఖరికి అద్దం పడుతోందన్నారు. ఏఐటీయూసి నియోజకవర్గం కార్యదర్శి ఎంబేటి చంద్రయ్య మాట్లాడుతూ పార్లమెంటు భవన ప్రారంభోత్సవం డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. ప్రధాని అధ్యక్షతన శనివారం నిర్వహించిన నీతి అయోగ్ సమావేశానికి దేశంలోని 11 రాష్ట్రాల ముఖ్యమంత్రులు నీతి అయోగ సమావేశానికి హాజరవడం దురదృష్టకరమన్నారు. సిపిఐ ఇటువంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తోందన్నారు. దేశ ప్రజలు కూడా వ్యతిరేకించాలని కోరారు. ఈ సమావేశంలో ఓబులేశు, హేమంత్, బాలాజీ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన నాగర్పమ్మ జాతర

ఓజిలి, మే 28, ప్రభాతవార్త



ఓజిలి గ్రామ దేవత నాగర్పమ్మ అమ్మవారి జాతర ఆదివారం వైభవంగా ముగిసింది. రాత్రి నుంచి గ్రామ దేవత నాగర్పమ్మను పూల మాలతో అలంకరించి ఊరేగింపుగా గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ బాణాసంచా తప్పెట్లు తాళాలు మంగళవాయిద్యాలతో అమ్మవారి ఊరేగింపు వైభవంగా సాగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పోలి టెంకాయలు కొట్టి అమ్మవారికి తీర్థప్రసాదాలు నైవేధ్యాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

## పిల్లలకు చదివే దివ్యాస్త్రం

గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్

గూడూరు, మే 28, ప్రభాతవార్త

దేశ భవిష్యత్తు నేటి తరం విద్యార్థుల పైనే ఉందని ప్రతి ఒక్కరు ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరాలని విద్యార్థి దశ నుండే కోరుకున్న లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని నేరవేర్చినప్పుడే మంచి జీవితం, భవిష్యత్తు ఏర్పడుతుందని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ అన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డు కారాదని ప్రభుత్వాలు పేద పిల్లల భవిష్యత్తుకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుందని అన్నారు. ఫీజు రియంబర్స్ ద్వారా పేద పిల్లలు చదువుకోవడం ఉన్నత శిఖరాలకు వెళ్లడం సంతోషదాయకం అన్నారు. చదువులో రాణిస్తూనే మార్గదర్శకులుగా ఎదగాలని కోరారు. తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులు ప్రణాళిక, పట్టుదలతో చదివి అనుకున్న మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

## టిడిపి వ్యవస్థాపకులు రామారావు శత జయంతి ఉత్సవాలు

గూడూరు, మే 28, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు శత జయంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సూచనల మేరకు శత జయంతి వేడుకలలో భాగముగా చెన్నూరు నందు పల్లంపర్తి మధుసూధన్ రెడ్డి, సీనియర్లను శాలువాతో సత్కరించి, కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడాల రత్నయ్య, బొమ్మిరెడ్డి పెంచల్ రెడ్డి, దుద్ధ రాఘవ రెడ్డి, పుట్టి గోపాల్ నాయుడు, హనుమాన్ రెడ్డి, రాపూరు సురేవంద్ర, యాళ్ళ హరి, సాయి, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## లో ఓల్టేజితో కాలిపోయిన విద్యుత్ పరికరాలు

కోట, మే 28 ప్రభాతవార్త

కోట మండలం విద్యానగర్‌లో పలు నివాసాల్లో శనివారం రాత్రి ఓల్టేజి కారణంగా ఫ్యాన్లు, లైట్లు, టివిలు కాలిపోయినట్లు బాధితులు వాపోయారు. విద్యానగర్ ప్రాంతంలో లో ఓల్టేజి కారణంగా తరచూ ఇళ్లలో విద్యుత్ పరికరాలు కాలిపోతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు ఆదివారం లోఓల్టేజిని సరిచేసేపనులుచేపట్టారు. శాశ్వతంగా లోఓల్టేజి లేకుండా సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## పుత్తూరులో ఎన్‌టీఆర్ శత జయంతి ఉత్సవాలు

పుత్తూరురూరల్, మే 28 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 100వ శత జయంతి ఉత్సవాలు ఆదివారం పుత్తూరు రూరల్ పరమేశ్వర మంగళం గ్రామ పంచాయతీలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంజిమాద వయ్య, రూరల్ పార్టీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, బాలాజీ, పరమేశ్వర మంగళం పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, వార్డు మెంబరు లక్ష్మిపతినాయుడు, బాబునాయుడు, ఇంధుమతి, ఆర్.మనోహర్, కొరపాటి మధురం, గణేష్, సుధాకర్, జయశేఖర్, సుబ్రహ్మణ్యంనాయుడు, తేజ, రవి, రాజా, తులసి, శంకర్‌నాయుడు, మహేష్, అడుసుమల్లి హేమంత్, గ్రామ యువత, మహిళలు పాల్గొన్నారు. అలాగే వేపగుంటలో నందమూరి తారకరామారావు 100వ శతజయంతి ఉత్సవాలు ఘనంగా జరిగింది. అనంతరం కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బాలాజీ, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు శేఖర్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ కవిత, కోటయ్య, మస్తాన్‌నాయుడు, బాబునాయుడు, లోకేష్ నాయుడు, పరశురాం, రమేష్, బాబు, కిరణ్, వేలు, రాజముత్తు, సంజీవి, సోము, దాము, బుజ్జి బాబు, ముత్తురాజు, అడుసుమల్లి హేమంత్, గ్రామస్థులు పాల్గొన్నారు.

